
క్రేన్ కథోత్సవం - 2006
కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ

# అంతా.... అంతే !




ఐతా చంద్రయ్య

పరాకులు, చిరాకులు ప్రకాశం దృష్టిలో పనికిమాలినవి. ఆఫీసులో బాసునుండి, ఇంటిలో ఇల్లాలుదాకా అతని ముందెవరన్నా చిరాకు ప్రదర్శించినా, పరాకుగా ప్రవర్తించినా చింతనిప్పులమీద చిందులేస్తున్న వారిని చూస్తున్నట్టు ఫీలవుతాడు. స్వతహాగా చలాకీ మనిషి. పాతవారు, కొత్తవారనే తేడాలు మరిచిపోయి అందరితో ఉల్లాసంగా జోకులు పీకుతూ హుషారుగా మాట్లాడ్తాడు. అందుకేనేమో ఊహ తెలిసింతర్వాత అతన్నే రోగమూ పలుకరించలేదు.

దేశవ్యాప్తంగా బ్రాంచీలున్న ఓ కార్పోరేటు కంపెనీ హెడ్డాఫీసులో పెద్దులాంటి ఆఫీసరతడు. యాజమాన్యము, ఉద్యోగుల మధ్య వారధిలాంటి వాడు. సాధారణ ఉద్యోగులు సెలవు మంజూరు కోసం సవాలక్ష బోగస్ కారణాలు చెబుతారని, ఆ విషయంలో ఆచితూచి నిర్ణయం తీసుకుంటే బాగుంటుందనుకుంటాడు.

ఆఫీసులో ఫైళ్లతో కుస్తీపడుతున్న వారెవరున్నా ముదుచుకు పోతూ "ఒంట్లో నలతగా ఉంది సెలవు కావాలి సార్!"అని సవినయంగా అడిగితే మాయాబజార్‌లోని ఘటోత్కచుడు గబుక్కున కళ్ళముందు కనబడినట్టు కింది నుంచి మీద్దాకా ఎగాదిగా చూసి

"అసలీ మనుషులకు అనారోగ్యమనేది ఎలా వస్తుందీ? రోజూ ఉదయం కాస్సేపు యోగాసనాలేస్తూ కాసింత వ్యాయామం చేస్తే ఏ రోగాలూ రావని నేనెంత చెప్పినా వినిపించుకుంటారా?" అంటూ. ఓ క్లాసు పీకుతాడు.

వయసులో తనకంటే పెద్దవారు అదే కారణంతో సెలవు అడిగితే ఓ చిరునవ్వు పారేసి "మీరీ వయసులో రోజుకో మూడు కిలోమీటర్లు మార్నింగ్‌వాక్, ధ్యానం, ప్రాణాయామం చేస్తూ పుష్టికరమైన ఆహారం తీసుకుంటే రోగాలన్నీ మీకే భయపడ్తాయిగదా !" అంటాడు. సమయం సందర్భం కలిసొస్తే ఓ జోక్ గూడా పేల్చేస్తాడు. అతని మాటల్ని, చేష్టల్ని ఆసాంతం ఆకలింపు చేసుకున్న అటెండర్ ఆగయ్య ఓసారి అందరి ముందు "మీరు గూడా రోజూ యోగాసనం వేస్తారా! వ్యాయామం చేస్తారా? అసలూ.... యోగాసనాలెట్లా వేస్తారో తెలుసా సార్?" సవినయంగా సవాలు విసిరాడు.

వారెవ్వా ! మొగాడివంటే నువ్వేరా ! అన్నట్టుగా అందరి చూపులూ ఆగయ్యను తడిమాయి. మహిళా ఉద్యోగినుల కాటుక కనురెప్పలు తుఫాను గాలికి కిటికీ రెక్కల్లా టపటపలాడినై.

"మాటలకు చేతలకు చెప్పరాని దూరం గదా !" ఒకాయన, పక్కనున్నాయన చెవులు కొరికాడు.

"మాటలకేంలే ! నరం లేని నాలుక గదా!" వెనక నుంచో వ్యాఖ్యానం దూసు కొచ్చింది.

పక్కనున్న స్టెనో భుజాలు కదిలించి పైట సర్దుకుంది. కింది పెదవిని పళ్లమధ్య బిగపట్టి కిసుక్కుమంది.

ప్రకాశంకు ఉప్పులేని కారం ఒంటికి పూసినట్టనిపించింది. ఆఫీసు గడియారం అప్పటికే ఐదుసార్లు టంగ్‌మని మీరంతా ఇంటికెళ్ళొచ్చునని గుర్తు చేసింది.

"మీరంతా నాతో రండి". ప్రకాశం రోషం బుసబుసలాడింది. ఛాలెంజి గుసగుసలాడింది. పరుగులాంటి నడకతో డాబా పైకి చేరు కున్నాడు. అందరినీ గుండ్రంగా నిలబెట్టి మధ్యలో సూర్య నమస్కారాలు, వృక్షాసనం, సర్వాంగాసనం, వజ్రాసనం ఆఖరుకు శవాసనం వేసి చూపించాడు. చక్రాసనం గూడా వేసి

"చాలా.... ఇంకేమన్నా కావాలా?" అడిగాడు.

కంప్యూటర్లో సర్కసుఫీట్లు చూస్తున్నట్లు అందరూ అవాక్కయ్యారు. ముక్కుమీద వేలేసుకుని చక్కా వెళ్ళిపోయారు.

✷ ✷ ✷

ఏ.సీ. ఆఫీసు చాంబర్ హాయిగా ఉంది.

"ఈరోజు టపాలో వెళ్లాల్సిన అర్జంటు లెటర్స్ టైపయినాయా?" కంప్యూటర్ అసిస్టెంటు వెంకటప్పయ్యను ఇంటర్‌కంలో అడిగాడు ప్రకాశం.

"స్సా...సా....సార్!" వెంకటప్పయ్య మాట తడబడుతోంది నీళ్ళు నములుతున్నాడేమో!

"ఏమైంది ? ఆ ఫైలు తీసుకొని చాంబర్‌కు రండి!!

"ర్ర.......ర్ర.....రా......లేను సార్."

"ఏం......తలపోగరా?"

"కక.....క్కాద్సార్ తలపోటు."

బయటికెళ్ళి ఓ ఫుల్‌బాటిల్ కొట్టేసి రాలేదు గదా !

"గంట క్రితం గంట కొట్టినట్టు మాట్లాడారు గదా! అప్పుడే నత్తి వచ్చేసిందా?"

"న్న.......న్న........నత్తి కాద్సారూ!"

"మరేమిటీ సుత్తి?"

"జొ.....జో.....జో......"

"అంటే ..........జోలపాట కావాలా?"

"మరీ....!"


"జ్జొ.... జొరమొచ్చేసింది సార్. ల్లే..... లేవలేను సారూ!" సెలవుకోసం సవాలక్ష వేషాలు. అందులో ఇదొకటన్నమాట. తానే బయటి కొచ్చేసి రామబాణంలా కంప్యూటర్ గదికి దూసుకెళ్ళాడు.

కాళ్ళు కుర్చీలో ముదుచుక్కూచున్నాడు వెంకటప్పయ్య. అరెరే.... మనిషి మెలికలు తిరిగిపోతున్నాడు. పక్క సీట్లవాళ్ళు చెరోపక్క నుంచున్నారు.

"సెలవు కావాలంటే....." ఏదో అనబోతూ నుదుటి మీద చెయ్యేసి కరెంటు షాక్ తగిలినట్టు లాక్కున్నాడు. "ఒళ్ళు బాగా... వేడి పెనంలా కాలిపోతుందే!"

అరగంట క్రితం ఆన్ చేసిన కంప్యూటర్లా వెలిగిపోయిన వెంకటప్పయ్య మొహం ఆఫ్‌చేసిన పాత టీ.వీ. తెరలాగుంది. అర్జంట్‌గా కొబ్బరి బొండాం తెప్పించి తాగించారు. వెంకటప్పయ్య దమ్ము దీశాడు.

"కీలు కీలుకూ గుండు సూదులు గుచ్చినట్టుంది సార్!"



ఆపసోపాలు పడుతూ నుంచోబోయి కుర్చీలో కూలబడ్డాడు.

ఆగయ్య సాయంతో ఆటోలో హాస్పిటల్ చేర్చారు. "హీరోలాగుండే వెంకటప్పయ్య జీరో ఐపోయా"దంటూ ఇద్దరు కో వర్కర్లు హీరో హోండా మీద ఫాలో అయ్యారు.

"మన వెంకటప్పయ్యకు చికెన్ గూన్యా నటా! గ్లూకోజ్ లెక్కుతున్నాయి సార్!" ఇద్దరిలో ఒకరు తిరిగొచ్చి చెప్పారు.

రెండ్రోజుల ముందు ఎకౌంటెంట్ ఇంటినుంచే సెలవు చీటీ పంపించి, చికెన్ గున్యా సోకిందని ఫోన్ చేశాడు.

చికెన్ బిర్యానీ దొరికింది గదాని తెగ తినేస్తే చికెన్‌గున్యా వస్తుందేమో! మధ్యాహ్నం అదే కారణంతో సెలవు చీటి పట్టుకొచ్చిన యూ.డీ.సీ.తో

"బర్డ్‌ఫ్లూతో వేలాది కోళ్ళు ఛస్తున్నా యని తెలిసి కూడా చికెన్ బిర్యాని తినడ మెందుకూ? ఇలా చికెన్ గున్యా తెచ్చుకోవడ మెందుకూ?" మందలింపుగా అన్నాడు.

ఒంటి నొప్పులతో ఏడ్వలేక, పై మాటలకు నవ్వలేక యూ.డీ.సీ ఆయాసంతో రొప్పుతున్నాడు. స్టెనో కిసుక్కుమంది.

"నవ్వెందుకొస్తుందటా?" లిప్‌స్టిక్ పెదాలనడిగాడు

"చికెన్‌గున్యా కోడిపలావుతో రాద్సార్".

"కోడిపలావుతో కాకపోతే కోడి పులుసుతో రావచ్చు".

"కోడిమాంసంతో పులుసు చెయ్యరు సార్".

"పులుసుతో కాకపోతే కోడి కూరతో... అంతేనా?" మందహాసం.

"అది కూడా కాద్సార్"

కాదా! మరి దేంతో వస్తుందో! అంతర్దృష్టి బుర్రను గిర్రున తిప్పేసింది...

పొద్దున్న శ్రీమతి అందించిన చాయ సేవిస్తూ టి.వీ.వార్తలు.. వార్తల మధ్య ప్రభుత్వ ప్రకటన –

చికెన్‌గున్యా ప్రాణాంతకం కాదు. అది పగలు కుట్టే తెల్ల టైగర్‌దోమ కాటుతో వస్తుంది. చికెన్‌గున్యాకు టీకా లేదు. నివారణే శరణ్యం.

టీ.వి.రంగుల హంగులు మొహాన్ని ఫోకస్ బల్బులా వెలిగించాయి.

"చికెన్‌గున్యా చికెన్ మటన్తో రాదు. తెల్లదోమ కాటుతో వస్తుంది. యామై రైట్?'' మందహాసం.

"అవున్సార్!" స్టెనోకు వేపకాయ నమిలినట్టుంది.

"నాకామాత్రం తెలీదా! మీకు తెలుసో లేదోనని టెస్ట్ చేశానంతే" కొసమెరుపుతో యూడీసీ సెలవు మంజూరైంది.

హమ్మ సారు వారూ ! అన్నట్టుగా చూసింది స్టెనో,

చికెన్ గున్యా సిటీ అంతా పారుకు పోయింది. తెల్ల టైగర్ దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ఆస్పత్రులు నిత్య కళ్యాణం పచ్చ తోరణంలాగున్నాయి. ప్రభుత్వాసుపత్రి డాక్టర్లు పరేషాన్. ప్రయివేట్ డాక్టర్లకు పండగ సీజన్, ఖుషీ, ఖుషీ, ఆరెంపీలు నాలుగు చేతులా సంపాదిస్తున్నారు. మెడికల్ షాపుల్లో కాసుల వర్షం కురుస్తోంది.

ఉద్యోగులిలా చికెన్ గున్యా అంటూ సెలవుల్లో వెళ్తే ఇహ ఆఫీసు పనెలా జరగాలి? ఆఫీసు పని సరిగ్గా జరగ్గపోతే యం.డి. అగ్గిమీద గుగ్గిలమైపోతాడు. ఆఫీసు ఉద్యోగులందరినీ సమావేశపరిచి 'తెల్ల టైగర్ దోమ పగలు కుడితేనే చికెన్ గున్యా వస్తుంది కాబట్టి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి. అందరు శుచీ శుభ్రత పాటిస్తూ దోమల తిరుగుడు నరికట్టాలి...." చెప్పుకుంటూ పోతున్నాడు.

"క్లాసు పీకుడు బాగానే ఉంది గానీ.... మనాఫీసు ముందున్న డ్రైనేజిని మేమే శుభ్రం చెయ్యాలా?" గుంపులో గోవిందం.

సర్కస్ ఫీట్లు వేస్తూ పట్టుదప్పి పడిపోయినట్లైంది ప్రకాశంకు. చికెన్‌గున్యా హంగామా ఆఫీసులో ఉద్యోగుల అటెండెన్స్‌ను అరవై శాతానికి దింపేసింది. ఉద్యోగ సంఘాల నుండో జాయింట్ మెమోరాండం అందింది. ఉద్యోగులు పగలంతా ఆఫీసులోనే ఉంటారు కాబట్టి టైగర్ తెల్లదోమలు ఆఫీసులోనే కుడుతున్నాయి. కాబట్టి 1. ప్రతి ఉద్యోగికో దోమతెర సప్లై చెయ్యాలి. 2. ప్రతి గదిలో మస్కిటో

---

2005 రామాకవితల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కవిత.

# మంట

భావరసార్ద్ర బడుగు సాహితీ కృషీ వలుణ్ణి
బాధల గనుల్లోంచి సుఖాల్ని తవ్వే శ్రామికుణ్ణి
కుళ్ళు సంఘం కోసం చీపురు పట్టిన పాకీవాణ్ణి
దేశమాలిన్యాన్ని క్షాళన చేసే సునామీని
కంచెలు వేసుకున్న రక్కసి గుండెల్ని
రంగుల కుంచెతో రసమయం చేసే చిత్రకారుణ్ణి
అందరికీ చెందే పృధ్విని మింగే కొందరి స్వార్థపరుల్ని
ఫిరంగులకు ఆహారంగా పెట్టే సైనికుణ్ణి
అణ్వస్త్రాల క్షిపణుల్ని పేదరైతుల
నాగళ్లుగా మలిచే కమ్మరిని
ఆకలీ అజ్ఞానం కొందరికే సొంతమనే
మనువాదులకి తలారిని
సంస్కరణాత్మక ఉపన్యాసాలపై నమ్మకం లేని నిరాశావాదిని
ఆచరణలో చేసి చూపించేవారి అనుసరుణ్ణి
మానవ మేధస్సుని లోకం లేబరేటరీకి
మోసుకెళ్లే అక్షరజ్ఞానం లేని శాస్త్రజ్ఞుణ్ణి
తప్పొప్పులను సరిదిద్ది నీతిమార్గం చూపించే స్నేహితుణ్ణి
నిదురపోతున్న లోకాన్ని మేల్కొలిపే చైతన్య జ్వాలను
జ్వాజ్వల్యమానంగా నరజాతి గుండెల్లో వెలిగే
విప్లవనెత్తురు మంటని.

**- జి. నరసింహమూర్తి**

కాయిల్స్ దినమంతా వెలుగుతుండాలి. 3. చికెన్ గున్యా స్టేషనరీ కోసం ప్రత్యేకంగా స్టోరు కీపర్లను నియమించాలి. 4. గున్యా ఏ క్షణాన ఎవరి మీద విరుచుకుపడుతుందో తెలియదు కాబట్టి వైద్య ఖర్చుల నిమిత్తం ప్రతి ఉద్యోగికి ఐదువేల రూపాయల గున్యా అలవెన్సు ఇవ్వాలి. 5. గున్యా పీడిత కాలాన్ని ప్రత్యేక సెలవుగా పరిగణించాలి.

గున్యా డిమాండ్ల పత్రం చూడగానే ప్రకాశంకు గూబ గుయ్ మన్నట్టనిపించింది. ఐదు కోర్కెల పత్రము ఐదు నిమిషాల్లో యం.డి. టేబుల్ మీదికెళ్ళింది.

"ఆఫ్టరాల్ జ్వరం కోసం ఇంత హంగామానా? దీనికో ప్రత్యేక అలవెన్సు గూడానా?" యం.డి. బేజారై నోరెల్ల బెట్టాడు. "ఇదెప్పుడూ, ఎక్కడా వినలేదు. వెంటనే యూనియన్ లీడర్లను పిలిపించండి."

మూడు యూనియన్ల లీడర్లు యం.డి. ముందున్నారు.

"అదేదో జ్వరానికి అంత ప్రతిఘటన అవసరమా?" నిలదీశాడు ప్రకాశం.

"సార్ ! మీరు యం.డి.గారిని తప్పు తోవ పట్టించొద్దు" ఓ లీడర్ పళ్ళు నూరాడు. అతని పిడికిళ్ళు బిగుసుకున్నై.

"మా వాళ్ళ అవస్తలన్నీ కళ్లారా చూస్తూ మీరే అట్లా మాట్లాడ్తే ఎట్లా సార్?" మరో లీడర్ చిటపట.... చిరాకు అరికాలు మంట నెత్తికెక్కినా కిక్కురుమనలేదు ప్రకాశం.

మూడో లీడర్ వణుకుతూ "నా.... నా.... నాకేదో అవుతుంది సార్. హవ్వా హబ్బో కీళ్ళన్నీ నొప్పులు సార్!" కాళ్ళు కుర్చీలోకి మలుచుకున్నాడు. మూటలా ముడుచుకు పోతున్నాడు.

"అరెరే....తెల్లటైగర్‌దోమ కుట్టిందా?" ప్రకాశం నాలిక్కరుచుకున్నాడు.

"క్క......క్కా......కావచ్చు సార్. హమ్మో...... కాళ్లూ చేతులు పడిపోయినట్టుంది స్సా....ర్." కుర్చీ కొరిగాడు. మిగతా ఇద్దరతని ఒళ్లు నిమిరి, "వామ్మో.... జొరం" కోరస్‌గా అనేశారు. అతణ్ణి కుట్టిన టైగర్ దోమే నన్ను కుడితే....! ప్రకాశం, యం.డి. హడలిపోయారు. వెన్ను పూసలోంచి వస్తున్న వణుకు బయటపడ కుండా "మనాఫీసు వ్యానులో హాస్పిటల్‌కు తీసుకెళ్లండి" ఆర్డరేసి గబగబా చాంబర్లో కెళ్ళి పోయాడు యం.డి.




సీనియర్ జర్నలిస్టు, కవి శ్రీమల్లయ్య 'కనుపాపలు' నానీల పుస్తకావిష్కరణ సభలో ప్రసంగిస్తున్న ప్రొ॥ ఎన్.గోపి. ఈ చిత్రంలో 'కనుపాపలు' రచయిత శ్రీ మల్లయ్య, కరీంనగర్ సమైక్య సాహితి అధ్యక్షులు శ్రీమాడిశెట్టి గోపాల్, రచయిత శ్రీ జూకంటి జగన్నాథం, అధికార భాషా సంఘం సభ్యులు శ్రీ కాలువ మల్లయ్య, సమాచార పౌరసంబంధాల శాఖ సహాయ సంచాలకులు శ్రీ కె. మార్కెండేయులు ఉన్నారు.

అలవెన్సు కోసం, సెలవు కోసం ఏమైనా చేస్తారు.... తనలో తాననుకున్నాడు ప్రకాశం.

చేర్పించి వచ్చిన వారు అది చికెన్ గున్యానే అని తేల్చేశారు. ప్రకాశం కంతా అయోమయంగా ఉంది.

యూనియన్ లీడర్లు నటనలో గూడా ఆరితేరి ఉంటారు.

"ఇదంతా కలనో వైష్ణవ మాయనో, యాజ మాన్యం దృష్టికి తీసు కెళ్తా" అన్నాడు యం.డి.

"సరేసార్, నోట్ తయారు చేయిస్తా' అన్నాడు, గాని ప్రకాశం అయోమయం అలాగే ఉంది.

"మిస్టర్ ప్రకాశం ! మీరంటే యాజమాన్యానికి తలలో నాలుక. మీ మీద పూర్తి విశ్వాసముంది."

"కావచ్చు సార్".

"బాగా ఆలోచించి సరైన సలహా ఇవ్వండి"

* * *

ఇంకా తెల్లవారలేదు. ప్రకాశం మంచమ్మీద మూలుగుతున్నాడు. రమణికి మెలకువొచ్చింది. 'ఎందుకట్లా మూల్గుతున్నా'రంటూ లైటు వేసింది. మొహమ్మీద వెలుగు చూడాలనుకుంది.

"హ...బ్బో....హమ్మో! వెన్నుపూసలోంచి వణుకొచ్చి ముంచేసింది. ఆ తత..... తర్వాత జ్వరమందుకుంది రమణీ! చింత నిప్పుల్లో బ్బొ....బర్లు తున్నటుంది. కీలు కీలుకూ... మ్మే..... మేకులు దిగేసినట్టుంది. హ్హా హా..... నొప్పులూ" అతిప్రయత్నమ్మీద పక్కకు తిరిగాడు. ఒళ్ళు నిమిరింది రమణి ప్రేమగా.

"ఓయమ్మో ! ఒళ్ళు మండిపోతుందండీ !" గాబరాపడుతూ తానో నర్సుననే సంగతి మరిచిపోయింది.

"ఇప్పుడెలా గండీ!" చేతులు పిసుక్కుంటోంది. కంప్యూటర్ ముందు కూచుని పాస్‌వర్డ్ మరిచిపోయినట్టు.గందరగోళంలో మునిగింది.

"హయ్యో ! నర్సువు....నువ్వే..... బబ్బ.... భయపడితే ఎట్లా రమణీ? బబ..... బాత్రూం....." లేవబోయాడు. ఒంట్లోని శక్తినంతా గ్యాసుపైపుతో లాగేసినట్టుంది. కాళ్లూ చేతులు సమ్మె చేస్తున్నాయి. నొప్పులకు తోడు శరీరమంతా భుగభుగలు.

"అ.......య్యో రమణీ! న్ను....నువ్వో నర్సువు గదా! హా..."

"అవును గదూ!..... రోజంతా హాస్పిటల్లో పేషెంట్స్‌తో యాతన. ఇప్పుడింట్లోనే

పేషెంటు" నెత్తి కొట్టుకుంది.

ధర్మామీటరందుకుని జ్వరం కొలిచి గుండెలమీద చెయ్యేసుకుంది. 'హమ్మో జ్వరం... నూటానాలుగు.'

"వామ్మో రమణీ!..." అవస్థలన్నీ చెప్పేశాడు.

ఏదో ఇంజక్షన్ చేసి ఏవో మాత్రలు మింగించింది. తెల్లవారింది మందులేవీ పంజేసినట్టు లేదు. అదే విషయం అర్ధాంగి నర్సుతో మొరపెట్టుకున్నాడు. ఆవిడ.... ఇది హాస్పిటల్, ఆయనెవరో.... అనుకుందో క్షణం. మోహం చిట్లించి భుజాలెగరేసింది.

"అదంతే..... మరీ..... చికెన్‌గున్యా అంటే చికెన్ పలావు అనుకున్నావా?...." వెంటనే ఇది ఇల్లు అనీ, ముందున్నది మొగుడనీ గుర్తుకొచ్చి నాలుక్కరుచుకుంది. "అది కాదండీ.. ఈ చికెన్‌గున్యా రాక్షసి పట్టుకుందంటే మూన్నాల్లు రోజులు కాళ్లూ చేతులాడనివ్వదు. హై టెంపరేచర్‌తోనే సహజీవనం చేస్తుంది. ఎంత బలమైన మందులు, ఇంజక్షన్లు వాడినా విషం కుండలో చాయచుక్కలు కలిపినట్టే..... లాభముండదు. మా హాస్పిటల్ చూశారా! గున్యా రోగుల గుడారంగా మారిపోయింది. మంచాల కింద గూడా రోగుల్ని పడుకోబెట్టినా స్థలం లేక వరండాలో పడుకోబెడుతున్నాం...."

"ఆ...మాత్రానికే..... మాత్రలూ, మందులెందుకు.... వ్యా....వాడాలో?"

గున్యానధిగమించి గూబ గుయ్ మనేలా అడగాలనుకున్నాడు.

"మందులు, మాత్రలు వాడకుంటే మరణం తథ్యం.... పడుకో!" ఒళ్లు ఝల్లుమంది ఈవిడ ప్రభుత్వాసుపత్రి నర్సు గదూ.... గుర్తుకొచ్చింది.

'అది కాదు రమణీ! చికెన్ గున్యా.... ప్రాణాలు తియ్యదన్నారు గదా మంత్రులు, అధికారులూ....'

"అంటారంటారు. ఈ రోగం వాళ్ల కొస్తే రోగం కుదిరేది." లోపల గుబగుబ లాడ్తున్నా పైకి ధైర్యం కూడగట్టుకుంది. మూడ్రోజులు డ్యూటీకి సెలవుచీటి పారేసి మొగుడితో ముచ్చట్లాడుకుంటూ ఇంట్లోనే ఉండిపోదామనుకుంది..... కాని.... అది కుదురుతుందా?

దీం దుంపదెగా! ఈ చికెన్ గున్యాకేం రోగమో కాని..... అది మనిషి మీద కూచుందంటే ముప్పుతిప్పలు బెట్టి ముప్పై చెరువుల నీళ్లు తాగిస్తుంది. మూన్నాల్లు రాత్రులన్నా పక్కనున్న వారిగ్గూడా నిద్ర లేకుండా చేస్తుంది. సాయం పట్టందే చికెన్ రోగి లేవలేడు. కూచోలేడు..... ఎన్నోసార్లు గొణుక్కుంది.

ఎందుకైనా మంచిదని.... మొదటి రోజే భర్తను ప్రైవేట్ నర్సింగ్‌హోంలో చేర్పించింది. ప్రభుత్వాసుపత్రి సేవలెంత పసందుగుంటాయో బాగా తెలుసు కాబట్టి ఆలస్యం చెయ్యకుండా అరుణా నర్సింగ్‌హోంకు ఆటోలో తీసుకెళ్ళింది. సెలైన్ ఎక్కించడం నుండి.... జ్వరం కొలుస్తూ మాత్రలు వేసే వరకు.... అన్నీ తానే స్వయంగా చూసుకుంది... నిజంగా అదో బ్రహ్మయజ్ఞంలా గన్పించింది. సెలవు పొడిగించక తప్పలేదు.

నాల్గోరోజు ప్రకాశం తనంత తాను లేచి కూచున్నాడు. రమణి మొహం విచ్చుకుంది. చాయ తాగగానే ప్రకాశం ప్రాణం పోసినట్టని పించింది. తనంత తానే బాత్రూం కెళ్లి స్నానం చేసొచ్చాడు. పెళ్లాన్ని పక్కకు కూచోబెట్టుకొని

"మా ఆఫీసులో ఎందరో గున్యా వాత పడ్డారు గానీ ఇంత అవస్థ ఎవరికీ కాలేదు సుమా!" రహస్యం విప్పాడు.

"నేను గూడా మా హాస్పిటల్లో వందలాది గున్యా రోగుల్ని చూశాను గాని.... నన్నెవరూ ఇంత ఇబ్బంది పెట్టలేదు మహానుభావా" మహా అనుభవాన్ని మాటల్లో చెప్పగలిగినందుకు తృప్తిగా నిట్టూర్చింది.

ఐదో రోజు డిస్చార్జి చేయించి ఇంటికి తీసుకెళ్ళింది. బిల్లు తడిసి మోపెడై ఓ నెల జీతాన్ని మింగేసింది.

ఆరో రోజు.... అంతా ఐపోయిందని.... హాయిగా డ్యూటీ కెళ్ళింది. సాయంత్రం ఆరింటికి ఆటోలో వచ్చింది ఇంటికి. ముంగిట్లోంచి భర్తను కేకేసింది.

ప్రకాశం ఆపసోపాలు పడుతూ బయటకొచ్చి "ఏమైందటా....! పావు కిలోమీటర్ దూరం నుండి ఆటోలో రావడమెందుకో?.." ఇంకేదో అనబోతూ పెళ్లాన్ని చూసి పరేషానై పోయాడు.

"ఉహు హూ c! నాకూ చికెన్

---

# హైకూలు

## నీళ్ళు

వేసవిలో
నీళ్ళు....
కన్నీళ్ళే.....

## కళ్ళు

కలులు కనే....
కళ్ళు
ఎదురుచూపుల
వాకిళ్ళు

## నెచ్చెలి

మనల్ని....
వదలని నెచ్చెలి
చలికాలం...... చలి

## మది

పురివిప్పిన
నెమలి
కోరికల మది.

## ఎన్నికలు

ఎన్ని కలలో
నాయకులకు
ఎన్నికలలో......!

## బలం

సినీరచయిత కలం....
యువతకు
బలం !!

– పి. శివాన్విత

గున్యా... హమ్మో....” ఆటోలోంచి లేచి బయటకు రానంది రమణి.

అన్నమో రామచంద్రా... అనుకుంటూ అదే ఆటోలో నర్సింగ్‌హోం తీసుకెళ్లాడు. అడ్మిట్ చేయించాడు.

అటు తాను మందులు వాడుతూ, ఇటు పెళ్లానికి సేవలందించడం.... హోటల్ నుండి టిఫిన్లు, క్యారేజీలు తెచ్చుకోవడం.... యమయాతనైంది ప్రకాశంకు. వెనకటి రోజుల్లో అశ్వమేధ యాగం చేసిన చక్రవర్తులు గూడా ఇన్నికష్టాలను భరించి ఉండరు.. అనుకున్నాడు.

పదిహేనురోజుల సెలవు తర్వాత పదహారో రోజు.... ఆఫీసులో అడుగు పెడుతూంటే ఘోరమైన నేరం చేసి తప్పించుకు తిరుగుతున్నట్టనిపించింది. కీళ్ళనొప్పులు..... 'నీవెంట మేమున్నాము, ముందట్లాగా పనిచెయ్య నిస్తామా!' అంటున్నాయి. అదంతా బలహీనత ప్రభావమే అనుకుని సరిపెట్టు కున్నాడు.

ఆఫీసులో ఉద్యోగులు కొందరు గున్యా వాత పడి ఇంటినుండి సెలవుచీటీలు పంపిస్తూంటే మరికొందరు ముక్కుతూ, మూల్గుతూ సెలవు నుండి తిరిగొస్తున్నారు. సెలవుక్కారణం అందరిదీ ఒకటే..... చికెన్ గున్యా.

ఉద్యోగుల డిమాండ్ల ఫైలు వెలికి తీశాడు.

ఐదు కోర్కెల పత్రాన్ని మరోసారి చదివాడు. “అవన్నీ సబబైనవే.... న్యాయమైనవే” గట్టిగా నోటు రాస్తు ఆరోది తన తరపున ప్రతిపాదించాడు. “ఉద్యోగి భార్యకు గాని, భర్తకు గాని చికెన్ గున్యా వస్తే సదరు ఉద్యోగికి ప్రత్యేకసెలవు మంజూరి చెయ్యాలి...”

ఫైలును యం.డి.చాంబర్‌కు స్వయంగా తీసుకెళ్లాడు. యం.డి. సీట్లో దోమలు దాగుడుమూతలాడుకుంటున్నాయి..... ఖాళీగా ఉంది. “యం.డి.గారు అహ్మదాబాద్ టూర్ కెళ్లారా?” పియ్యే నడిగాడు – గుర్తుకొచ్చి.

“అహ్మదాబాదు టూర్ క్యాన్సిల్.. హాస్పిటల్‌లో ఉన్నారు.”

“అయ్యో పాపం.... యామైందీ?”

“చికెన్ గున్యా సార్!”

# ఆడపిల్లలు

– బి.వి.యస్.శాస్త్రి

ఆడపిల్లలు ఆడపిల్లలు
అవని అంతా ఆడపిల్లలు
ఆడపిల్లలు ఆడపిల్లలు
ఎండలో చిరువానజల్లులు

పెద్దపులులూ సింహాలమధ్యలో
గుంటనక్కలూ తోడేళ్ల మధ్యలో
సెలయేళ్లమీంచీ శాద్వలాల మీంచీ
చటుక్కునదుమికే లేడిపిల్లలు –
నవ్వులతోనూ పువ్వులతోనూ
అక్కడ యిక్కడ అంతటా
ఆడపిల్లలు ఆడపిల్లలు
మంచు కురిసిన బొండుమల్లెలు –

సెలయేటి అలలమీద
చంద్రబింబశకలాలు
మహాకవుల ఊహలు
సమర్థవంతుడి ఈహలు
వేదనాసంసారపంకంలో
ఆనందంగా విరిసిన ఉత్పలాలు
మగవారి మొరటుశిలాగృహాలకు
మాన్యత చేకూర్చే మమతల వెల్లలు
మరులపాలవెల్లులు –

కర్పూరపు క్రోవులు
విరజాజుల తావులు
అరులపాలు కాకుండా దేవతలు
అమృతం దాచుకున్న తావులు
తల్లిపాలు త్రాగిన సంతృప్తిగరిమలో
తరళించే శిశివు పెదాలమీద నవ్వులు –

ఛతుస్సముద్రకాసారంలో
ధాత్రీమృణాలపత్రంమీద
ముచ్చటగా పడ్డ సలిలబిందువులు
మాధవుడి వేణువులో
నినదించిన గీతికలు
చిన్మయుడి సృజనశక్తికి
భూమిమీది చిహ్నాలు
జడమానస ప్రకృతికి
శస్త్రచికిత్స చేసే విచ్చుకత్తులు –

ఆడపిల్లలు ఆడపిల్లలు
అవని అంతా ఆడపిల్లలు
అమ్మవసుమతి కడుపు పంటలు
ఆకుపచ్చని ఆడపిల్లలు !!

సంపాదన : అదృష్టదీపక్

# అంకితం

ఈ ప్రజాస్వామ్య యుగంలో
కృతి
కన్య కాదు,
అంకితం తీసుకొన్నవాడు
కృతి భర్త కాదు.....
కవి అంటే
ఓ మహాఫలవృక్షం
కృతి అంటే
పండ్లగుత్తి,
అంకితం తీసుకునేవాడు
పండ్ల కొట్టువాడు.....
అంకితం ఇవ్వటం అంటే
అదొక బాధ్యత మోపటం,
పండ్లను ప్రచారం చేస్తూ
పదిమందికీ చేర్చాలని,
చైతన్య రుచులతో జనాన్ని
శక్తిమంతులుగా మార్చాలని.....
ఓ మురికి మనసు
ముసలి కవీ !
కృతి ఇప్పుడు కన్య కాదు –
రోగాలను తొలగించే మహా ఔషధం!
మనసుల్ని వెలిగించే
మధుర రస తేజం !

– డా॥ రావిరంగారావు